

సాక్షి
పల్నాడు
బుధవారం ׀ 12 ׀ జూన్ ׀ 2024





## సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## 18న ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవం ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ముప్పాళ్ల: ముప్పాళ్ల మండలం కుందురు వారిపాలెంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. స్వామికి 108 కలశాలతో అభిషేకం, హోమం, పంచామృత అభిషేకం చేశారు.

### న్యూస్‌రీల్

## పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట: ఈ ఏడాది ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు పొందేందుకు జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసాధారణ ధైర్యసాహసాలు చూపిన చిన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇవ్వటమే అవార్డుల ఉద్దేశమన్నారు. ఎంపికైన వారికి వచ్చే జనవరిలో న్యూఢిల్లీలో పురస్కారాలు ప్రదానం చేస్తారని వివరించారు. అర్హులైన బాలలు ఆన్‌లైన్‌లో https://awards.gov.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## గర్భిణులకు సకాలంలో సేవలు అందించాలి



ఇంకొల్లు (చినగంజాం): గర్భిణులకు సకాలంలో సేవలందించి మాతృ శిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ అన్నారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించి సిబ్బందితో ఆశా డే సందర్భంగా సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అంజలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులకు అందించాల్సిన సేవలను సకాలంలో అందించాలన్నారు. హై రిస్క్ గర్భిణులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఇతర సేవలను అందించాలని చెప్పారు. తద్వారా శిశు మాతృ మరణాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు నిర్వహిస్తున్న యాప్ గురించి ఆమె సమీక్షించారు. గర్భిణులు హై రిస్క్ గర్భిణులు అర్హులైన దంపతులు చిన్నపిల్లల టీకాలు గురించి ఆమె సమీక్షించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణతంత్ర దినోత్సవం–2025ను పురస్కరించుకొని అందించే పద్మ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలో అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆగస్ట్ ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. క్రీడాకారులు www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే తమ దరఖాస్తులను sportsinap@gmail.com, dsanrtpalnadudistrict@gmail.comకు పంపాలని సూచించారు.

## యార్డులో 34,438 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,438 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,300 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,841 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వ రరెడ్డి తెలిపారు.

## నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,400, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.

# వన్‌డర్‌ఫుల్

### 'జిష్ణు'విలాసం.. 'ఏపీఈఏపీ' స్టేట్ టాపర్ మనోడే



కె.ప్రభాస్, ఇంజనీరింగ్‌లో 10వ ర్యాంకు



సోలే ప్రణయ్ విక్టర్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 25వ ర్యాంకు



ఎం.శ్రీచరిత సాయి, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 29వ ర్యాంకు

- ఇంజినీరింగ్‌లో గుంటూరు విద్యార్థి జిష్ణుసాయికి 1వ ర్యాంకు
- గుంటూరులోనే చదివిన మరో విద్యార్థికి 2వ ర్యాంకు
- గుంటూరుకు రాష్ట్రస్థాయి 5, 10వ ర్యాంకులు
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో చేరనున్న ఏపీఈఏపీ సెట్ టాపర్లు
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 25, 29 వంటి మెరుగైన ర్యాంకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్–2024 ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో గుంటూరు విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు 2, 5, 10 టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్నారు.

గుంటూరుకు చెందిన ఎం.జిష్ణుసాయి, స్టేట్ ఫస్టు ర్యాంకు పొందగా, గుంటూరులోనే చదివిన ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, 2వ ర్యాంకు సాధించాడు. కె.మనీష్ చౌదరి, 5వ ర్యాంకు, కె.ప్రభాస్ 10వ ర్యాంకు పొందారు. ఈ విద్యార్థులు ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అఖిల భారతస్థాయిలోనూ టాప్ ర్యాంకులను సాధించారు. ఐఐటీల్లో సీటు సాధించడమే లక్ష్యంగా ఉన్నారు. ఐఐటీల్లో సీట్ల కేటాయింపునకు ఉద్దేశించి ఈనెల 10వ తేదీన ప్రారంభమైన జాయింట్ సీట్ అలాట్‌మెంట్ కౌన్సెలింగ్ (జోసా)లో పాల్గొని ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలోనూ విద్యార్థులు మంచి ర్యాంకులు సొంతం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన సోలే ప్రణయ్ విక్టర్ 25వ ర్యాంకు, ఎం.శ్రీచరిత సాయి 29వ ర్యాంకు సాధించారు.

### ఖరగ్‌పూర్, రూర్కీలో సీటు వస్తుందని భావిస్తున్నా



నాన్న శ్రీనివాసరావు కంపెనీ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, అమ్మ రాజేశ్వరి పెనుమాక జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. జేఈఈ మెయిన్స్‌లో 236, అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో 469వ ర్యాంకు సాధించాను. ఐఐటీలో సీఎస్‌ఈలో సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాను. జోసా కౌన్సెలింగ్ ద్వారా ఖరగ్‌పూర్, రూర్కీ ఐఐటీల్లో సీటు వస్తుందని ఆశిస్తున్నాను. మెరుగైన ర్యాంకు సాధనకు అధ్యాపకుల సహకారం మరువలేనిది.

కె.మనీష్ చౌదరి, 5వ ర్యాంకర్, గుంటూరు

### ముంబై ఐఐటీనే ఫస్ట్ చాయిస్



ఐఐటీలో చదవడమే నా లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అఖిల భారత స్థాయి ఓపెన్ కేటగిరీలో సాధించిన 62వ ర్యాంకు ఆధారంగా జోసా కౌన్సెలింగ్‌లో ముంబై ఐఐటీలో సీఎస్‌ఈ బ్రాంచ్‌కు మొదటి ఆప్షన్ ఎంపిక చేసుకున్నాను. అక్కడే సీటు వస్తుందని భావిస్తున్నాను. అమ్మానాన్న జ్యోతి, కృష్ణమోహన్‌కు గర్వకారణంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. పదో తరగతి వరకు ఐసీఎస్‌ఈ సిలబస్‌లో ఐఐటీకి ఎటువంటి ఫౌండేషన్ లేకుండా చదివాను. రెండేళ్ల ఇంటర్ చదువుతోపాటు ఐఐటీకి ఇచ్చిన శిక్షణతోనే జేఈఈ మెయిన్స్ రాసి 18వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 62వ ర్యాంకు సాధించాను. కాలేజీలో డైలీ, వీక్లీ టెస్టులు రాయడం ద్వారా ఎప్పటికప్పుడు పొరపాట్లను దిద్దుకుంటూ వచ్చాను. అధ్యాపకులు ఇచ్చిన సూచనలు పాటించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా మెరుగైన ర్యాంకు సాధించాను. పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో అధ్యాపకుల సహకారం మరువలేనిది.

– ఎం.జిష్ణుసాయి, స్టేట్ ఫస్ట్ ర్యాంకర్, గుంటూరు

### ముంబై ఐఐటీలో చేరతా



ముంబై ఐఐటీలో సీఎస్‌ఈలో సీటు సాధనే లక్ష్యంగా ప్రథమ ఎంపిక చేసుకున్నాను. మా స్వస్థలం కర్నూలు. నాన్న రామేశ్వర్‌రెడ్డి స్కూల్ బ్యాగులు కుడతారు. అమ్మ అరుణ గృహిణి. 6వ తరగతి నుంచి గుంటూరులోని జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 50వ ర్యాంకు సాధించాను. అయితే అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకు కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో హాజరయ్యాను. కాలేజీలో ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం చదువుకుని, డైలీ, వీక్లీ టెస్టులతో ముందుకు వెళ్లడం ద్వారా మంచి మార్కులు స్కోర్ చేయవచ్చు.

– ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, స్టేట్ 2వ ర్యాంకర్, కర్నూలు

# నేడు గుంటూరు జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు



జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లాలో బుధవారం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం విజయవాడ కేసరపల్లి ఐటీ పార్క్‌లో ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణం స్వీకారం, దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్న నేపథ్యంలో జిల్లాలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలకు జాతీయ రహదారి (హైవే)పైకి అనుమతుల్లేవని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలు, వాహన చోదకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

**వాహనాల మళ్లింపు ఇలా..**

- గుంటూరు– విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి, తెనాలి, వే మూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదగా వెళ్లాలి.
- చెన్నై నుంచి వైజాగ్ వెళ్లే వాహనాలు బుడంపాడు, తెనాలి, వేమూరు, వెల్లటూరు, పెనుమూడి, అవినిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- చెన్నై నుంచి బాపట్ల, చీరాల వైపు వెళ్లే వాహనాలన్నీ గుంటూరు ఏటుకూరు అండర్ పాస్ కింద నుంచి ప్రత్తిపాడు, పర్చూరు, చీరాల, బాపట్ల నుంచి 216 జాతీయ రహదారి మీదగా వెళ్లాల్సి ఉంది.
- గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్ళాలి.
- చెన్నై– హైదరాబాద్ వెళ్లే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల మీదగా హైదరాబాద్ వెళ్లాలి.
- గుంటూరు నుంచి విజయవాడ వైపునకు ఎటువంటి వాహనాలకు అనుమతుల్లేవు.
- చిలకలూరిపేట– హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు చిలకలూరిపేట వై జంక్షన్ (గుంటూరు) నుంచి పేరేచర్ల మీదుగా వెళ్లాలి.
- అత్యవసర వాహనాలకు ఏ దారి నుంచైనా అనుమతి ఉంటుంది.

# జూన్ నెలకు ఎరువులు సిద్ధం

### జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి

నరసరావుపేటరూరల్: ఖరీఫ్‌లో జూన్ నెలకు అవసరమైన ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. ఎరువుల సరఫరా– ప్రణాళిక అనే అంశంపై జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మంగళవారం ఎరువుల తయారీ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2,44,620 హెక్టార్లుగా ఉందన్నారు. ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, మిరప పంటలను అధిక విస్తీర్ణంలో జిల్లాలో సాగు చేస్తారని తెలిపారు. ఇందులో ప్రధానంగా పత్తి పంటను 1,07,186 హెక్టార్లలో, మిరప పంటను 58,202 హెక్టార్లలో సాగు చేస్తారని వివరించారు. సాధారణ వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎరువుల సరఫరాలో కొరత ఉండకూడదని స్పష్టంచేశారు. జిల్లాలో ప్రస్తుతం 79,100 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సరఫరా ప్రణాళిక ప్రకారంలో జిల్లాలోని అన్ని మండలాలకు ఎటువంటి వ్యత్యాసం లేకుండా అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్, వ్యవసాయ అధికారి సుజాత పాల్గొన్నారు.



ఎరువుల కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

# పెదకాకాని వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- జాతీయ రహదారి రక్తసిక్తం
- ముగ్గురి మృతి
- 10 మందికి గాయాలు



పొన్నూరు చరణ్ తేజ, కుర్రా రాంబాబు, ధనాల మధుబాబు

పెదకాకాని: పొట్టకూటి కోసం విజయవాడ వెళ్లి తిరిగి వస్తున్న కూలీలపై విధి కన్నెర్ర చేసింది. కాసేపట్లో ఇంటికి చేరతారనుకునే సమయంలో మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో పంజా విసిరింది. ముగ్గురిని అక్కడికక్కడే బలి తీసుకుంది. సోమవారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఒకరు చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో పోరాడుతున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు చెన్నకేశవ డెకరేషన్ సంస్థలో అలంకరణ పనులు చేసే ఏడుగురు కూలీలు విజయవాడ ఆటోనగర్‌లో పనులు ముగించుకొని సోమవారం రాత్రి టాటా ఇంట్రా ట్రక్కులో గుంటూరుకు బయలుదేరారు. కొద్దిసేపట్లో గమ్యస్థానాలకు చేరతారనగా వాళ్లు ప్రయాణిస్తున్న వాహనం పెదకాకాని సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న మిల్లర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డం తిరిగింది. మిల్లర్‌ను తీసుకెళ్లే వ్యాన్ మరమ్మతులకు గురై నిలిచి పోవడంతో దానిని సిబ్బంది అక్కడే వదిలేశారు. దీంతో ప్రమాదం జరిగింది. ట్రక్కు డ్రైవర్‌తోపాటు ఏడుగురు కూలీలూ గాయపడ్డారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి గుంటూరు వస్తున్న కారు అతివేగంగా వచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రక్కును తప్పించబోయి మిల్లర్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పెదకాకాని పోలీసుల సహకారంతో అంబులెన్సుల్లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ట్రక్కులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో పొన్నూరు చరణ్ తేజ (18), కుర్రా రాంబాబు (50) అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. మిగిలిన వారికి చికిత్స ప్రారంభించారు. వీరిలో ధనాల మధుబాబు (26) చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మరో వ్యక్తి మృత్యువుతో పోరాడుతున్నట్లు సమాచారం. పొన్నూరు చరణ్ తేజ పాత గుంటూరుకు చెందిన యువకుడు. కుర్రా రాంబాబు ఖమ్మం జిల్లా ఎర్రపాలెం నివాసి. ఈయన ప్రస్తుతం పేరేచర్లలో ఉంటున్నాడు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ధనాల మధుబాబు పాత గుంటూరు వాసి. ట్రక్ డ్రైవర్ నూర్‌బాషా జాన్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ విభాగంలో పోస్టుమార్టం అనంతరం మూడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# ఇంధన రంగాన చిరంజీవి

- వాణిజ్య వినియోగ స్వదేశీ కెటలిస్ట్ రూపశిల్పి
- భారత్ పెట్రోలియ కార్పొరేషన్ ఆర్‌అండ్‌డీ జీఎంగా నియామకం
- తెలుగు శాస్త్రవేత్త ఘనత

తెనాలి: ఇంధన రంగంలో భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఓ తెలుగు శాస్త్రవేత్త సమాధానంగా కనిపిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతున్న ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవటానికి పరిష్కార మార్గం చూపే దిశగా పరిశ్రమిస్తున్నారు. పెట్రోలియంను శుద్ధి చేసే కెటలిస్టును స్వదేశీ పరిజ్ఞానంతో ఆవిష్కరించి, కేంద్ర ప్రభుత్వం నుంచి డాక్టర్ శిష్టా కామేశ్వరి యంగ్ సైంటిస్ట్ అవార్డు సహా 'ఫిక్కీ' వంటి పలు ప్రతిష్టాత్మక గౌరవాలను స్వీకరించారు. తాజాగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆర్‌అండ్‌డీ జనరల్ మేనేజరుగా నియమితులయ్యారు. ఆ శాస్త్రవేత్త పేరు డాక్టర్ తోట చిరంజీవి.

**ఇదీ కుటుంబ నేపథ్యం**

తోట చిరంజీవి స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అంగలకుదురు. 1973 జనవరి 30న జన్మించారు. తల్లిదండ్రులు అంజమ్మ, వెంకయ్య. తెనాలిలో డిగ్రీ తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎస్సీ (కెమిస్ట్రీ) చేశారు.

**వృత్తిగత నేపథ్యం**

పీజీ తర్వాత చిరంజీవి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కారంపూడిలో ఉపాధ్యాయుడిగా కెరీర్ ఆరంభించారు. డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం నుంచి పీహెచ్‌డీ ఫెలోషిప్ రావటంతో ఉద్యోగాన్ని వదిలేశారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ కెటలిస్ట్స్ ఫర్ పెట్రోలియం రిఫైనింగ్' ప్రత్యేకాంశంగా 2000లో డాక్టోరల్ స్టడీస్‌ను పూర్తిచేసిన డాక్టర్ చిరంజీవికి విదేశీ అవకాశాలొచ్చాయి. స్వదేశంలోనే పనిచేయాలన్న ఉద్దేశంతో వివిధ దేశాల్లోని పరిశోధన లేబొరేటరీల ఆహ్వానాన్ని అంగీకరించలేదు. అదే సమయంలో



డాక్టర్ తోట చిరంజీవి

2001లో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రారంభించిన ఆర్‌అండ్‌డీ విభాగం (నొయిడా)లో తొలి బ్యాచ్ శాస్త్రవేత్తలో ఒకరుగా చేరిపోయారు. కెటలిసిస్ లేబొరేటరీని ఏర్పాటుచేసి, అక్కడ చేసిన పరిశోధనలతో ఎన్నో విజయాలను సాధించారు.

**పెట్రోలియం శుద్ధికి త్రికరణశుద్ధిగా..**

పెట్రోలియం శుద్ధిలో ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారాల దిశగా తన పరిశోధనలకు త్రికరణశుద్ధిగా పదును పెట్టారు. పర్యావరణానికి హాని చేసే కాలుష్య పదార్థాలను తగ్గించేలా ఫలితాలను రాబట్టారు. పెట్రోలులో సల్ఫర్‌ను తగ్గించేందుకు చేసిన పరిశోధనలకూ గుర్తింపు లభించింది. 'స్వదేశీ పరిజ్ఞానంతో గ్యాసోలైన్ సల్ఫర్ రిడక్షన్ కెటలిస్ట్'ను రూపొందించటం ద్వారా అద్భుతాన్ని ఆవిష్కరించారు. అప్పటివరకు పెట్రోలియంను శుద్ధి చేసే పదార్థాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. చిరంజీవి ఆవిష్కరణతో 30 శాతం ఖర్చుతో స్వదేశీ పరిజ్ఞానంతోనే ముడి పెట్రోలియంను శుద్ధి చేసేందుకు అవకాశాన్ని చూపారు. ఇదే క్రమంలో డాక్టర్ చిరంజీవి, ఆయన బృందం, గ్యాసోలైన్ సల్ఫర్ రిడక్షన్ కెటలిస్ట్‌ను అభివృద్ధి చేసి, వాణిజ్యపరంగా వినియోగించుసేలా చేసిన పరిశోధన, 'డెవలప్‌మెంట్ అండ్ కమర్షియలైజేషన్ ఆఫ్ ఇన్‌డిజెనస్లీ డెవలప్‌డ్ గ్యాసోలైన్ సల్ఫర్ రెడక్షన్ కెటలిస్ట్ ఫర్ రిఫైనరీస్' పెట్రోకెమికల్ సెక్టారులో ఉత్తమ గ్రీన్ ప్రాడక్ట్‌గా 'ఫిక్కీ' సస్టైనబులిటీ అవార్డును గెలిచింది.

### ఎన్నో అవార్డులు..

డాక్టర్ చిరంజీవి భారత పెట్రోలియం సంస్థలో టెక్నాలజీ కేటగిరీలో 'ఐడియా' అవార్డును 2005, 2008లో అందుకున్నారు. నవీన ఆవిష్కరణకు 2011–12లో శిష్టా కామేశ్వరి యంగ్ సైంటిస్ట్ అవార్డుతో సత్కారం అందుకున్నారు. ఐఐసీటీ, సీఎస్ఐఆర్ సంయుక్తంగా 2012లో హైదరాబాద్‌లో నిర్వహించిన 21వ జాతీయ కెటలిసిస్ సింపోజియమ్‌లో కెటలిసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ అవార్డును బహూకరించింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ విశ్వనాథన్, అప్పటి అధ్యక్షురాలు లక్ష్మీకాంతం చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్న సదస్సులో 20 మంది అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, 600 మంది పరిశోధకులు పాల్గొన్నారు. అంతకుముందు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (న్యూఢిల్లీ) రీసెర్చ్ ఫెలోషిప్‌ను డాక్టర్ చిరంజీవి పొందారు. జర్మనీలోని లీప్‌జిగ్ యూనివర్సిటీ, జపాన్‌కు చెందిన హొక్కైడా యూనివర్శిటీలు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను ఆఫర్ చేశాయి. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 91 పరిశోధన పత్రాలను సమర్పించారు. చెన్నై ఐఐటీలో 2010లో 20వ జాతీయ కెటలిసిస్ సింపోజియమ్‌లో సమర్పించిన పరిశోధన పత్రానికి ఉత్తమ అవార్డు లభించింది. ప్రతిష్టాత్మక 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' (ఎఫ్ఐసీసీఐ) అవార్డును 2019 నవంబరు 11న ముంబయిలో డాక్టర్ చిరంజీవి స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన చేసిన పరిశోధనలపై 30 కిపైగా పేటెంట్లు పొందగా, వీటిలో 20 అంతర్జాతీయంగా ఉన్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ కెటలిసిస్ సంస్థల్లో ఆయనకు సభ్యత్వముంది.

# ప్రతి నిర్మాణానికీ అనుమతి తప్పనిసరి

### బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ బాబూరావు

బాపట్ల: గృహ నిర్మాణాలతోపాటు ప్రతి నిర్మాణానికీ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, దీనిపై పంచాయతీ కార్యదర్శులు ప్రజల్లో అవగాహన కల్పించాలని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ బాబూరావు పేర్కొన్నారు. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు, కాకుమాను, పెదనందిపాడు మండలాల పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వైస్ చైర్మన్ బాబూరావు మాట్లాడుతూ బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న రెండు పురపాలక సంఘాలతోపాటు పంచాయతీల్లోనూ ప్రతి నిర్మాణానికీ అనుమతులు తప్పనిసరి అని వివరించారు. అనుమతులకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆన్‌లైన్ విధానంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తు చేయించి ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 300 చదరపు మీటర్లలోపు నిర్మించే నివాస భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసే అధికారం పంచాయితీ కార్యదర్శులకు ఉందని వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శంకరరావు, డీఎల్‌పీఓ స్వరూపరాణి, ఏపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఆంక్షలతో విమాన ప్రయాణికులకు సూచనలు

విమానాశ్రయం(గన్నవరం): విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లిలో బుధవారం జరగనున్న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షల దృష్ట్యా విమాన ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు వహించాలని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎల్.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్న దృష్ట్యా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు షెడ్యూల్ చేయబడిన విమానాల్లో ప్రయాణించే వారు ఉదయం 9.30 గంటలలోపు, విమాన ప్రయాణికుల కోసం వాహనాల్లో వచ్చే వారు ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు చేరుకోవాలని తెలిపారు.

# ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్, డీజీపీ



ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్, డీజీపీ

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఈ నెల 12న జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా పరిశీలించారు. ప్రమాణ స్వీకార ప్రధాన వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో సీఎస్, డీజీపీ సమీక్షించారు. అనంతరం సభా ప్రాంగణం సుందరీకరణ, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం, గ్యాలరీల ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అనంతరం విమానాశ్రయాన్ని సందర్శించిన సీఎస్, డీజీపీ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు విచ్చేయనున్న సందర్భంగా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు డీజీపీ బాగ్చి, ప్రత్యేకాధికారులు ప్రద్యుమ్న, బాబు.ఏ, వీరపాండ్యన్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉపసర్పంచి నాగమల్లేశ్వరరావు అంత్యక్రియలు పూర్తి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఉప సర్పంచి, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు అంత్యక్రియలు సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ నెల 6న ఆయన ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతి చెందాడు. పోలీసుల జాప్యం కారణంగా ఆ రోజు పోస్టుమార్టం కాలేదు. సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని అప్పగించడంతో రెంటపాళ్ల గ్రామానికి తీసుకు వచ్చారు. అయితే మృతుడి మరదలు శ్రావణి లండన్ నుంచి రావాల్సి ఉండడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించలేదు. ఆమె రాకతో మంగళవారం అంత్య క్రియలు నిర్వహించారు. గ్రామంతో పాటు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పెద్ద ఎత్తున తరలివచ్చి నాగమల్లే శ్వరరావుకు నివాళులర్పించారు. మృతుడి తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లు, తల్లి కుమారి, మృతుడి భార్య నందిని, కుమార్తె యశస్విని, సోదరుడు శ్రీకాంత్‌లకు పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉపేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, కళ్లం విజయ భాస్కర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ జలీల్ హాజరయ్యారు.

### భారతికి సాంబయ్య స్మారక పురస్కారం ప్రదానం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్. సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సాంబయ్య వర్ధంతి, వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఉపకులపతి దేపూరు భారతికి విద్యాదాత సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డు అందజేసి, సత్కరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సీహెచ్ భాస్కరరావు సభకు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(కో–ఆర్డినేషన్) పయ్యావుల పార్వతీ, హిందీ పండితులు పారేపల్లి భార్గవరామ్, దుర్గా ప్రసాద్, గ్లోబల్ ఆటోమేషన్ యాజమాని సీహెచ్ చైతన్య అతిథులుగా హాజరై, భారతిని సాంబయ్య పురస్కారంతో సన్మానించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఆకుల వెంకటనాగసాయిమనస్వికి పది వేల నగదు పురస్కారంతో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం నాట్యాచారిణి లేఖ్యా భరణి బృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించింది.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మలేరియా, ఫైలేరియా జోనల్ ఏడీ వీర్రాజు
- బోయపాలెం విశ్వతేజ నూలుమిల్లు సందర్శన
- మలేరియా సోకిన చిన్నారుల గురించి ఆరా
- యడ్లపాడు పీహెచ్‌సీ రక్తపరీక్షల రికార్డులు తనిఖీ



బోయపాలెంలో మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న మలేరియా, ఫైలేరియా జోనల్ ఏడీ వీర్రాజు

యడ్లపాడు: మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని మలేరియా, ఫైలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్(ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జోనల్) జి.వీర్రాజు పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీన యడ్లపాడు మండలం బోయపాలెంలోని విశ్వతేజ నూలు మిల్లులో పనిచేస్తున్న కుటుంబంలోని ఇద్దరు చిన్నారులకు మలేరియా సోకిన విషయం తెలిసిందే. ఈ విషయంపై చిలకలూరిపేట మలేరియా సబ్‌యూనిట్ అధికారుల, యడ్లపాడు పీహెచ్‌సీ సిబ్బందితో కలసి ఆయన నూలు మిల్లును సందర్శించారు. మలేరియా సోకిన చిన్నారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మలేరియాకు సంబంధించిన పూర్తి లక్షణాలు లేనందున సోమవారం వారిని గుంటూరు జీజీహెచ్ నుంచి డిచార్జి చేసినట్లు యడ్లపాడు పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్ పున్నారావు వివరించారు. మిల్లు ప్రాంగణంలోని బ్లాక్‌లను, డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించారు. ఎక్కడా నీటి నిల్వల్ని ఉండకుండా చూడాలని వీర్రాజు ఆదేశించారు. మలేరియా నిర్మూలనకు సిబ్బంది, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ప్రధానంగా ప్రజల్ని వివిధ జ్వరాలు, మలేరియా, ఫైలేరియా, డెంగీ వ్యాధులపై సమగ్ర అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. హాస్పిటల్‌లో రోజు సందర్శిస్తున్న పేషెంట్ల వివరాలను పరిశీలించారు. అలాగే రక్తపరీక్షల విభాగానికి వెళ్లి రక్తనమూనాల సేకరణ, గత కొద్దికాలంగా ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు తదితర విషయాలపై రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయం ఏఎంఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట మలేరియా సబ్‌యూనిట్ ఎంపీహెచ్ఓ కోడెల శ్రీనివాస్, ఎంపీహెచ్ఎస్ చలమారెడ్డి, ఏఎన్ఎం జోస్ మేరీ, హెల్త్ అసిస్టెంట్ యల్లమందయ్య ఉన్నారు.

# ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

- బోయపాలెంలోని కొండవీడు కొండల వద్ద ఘటన
- మృతుడు ప్రత్తిపాడు నియోజకవర్గం పాతమల్లాయపాలెం వాసి



ఆత్మహత్య చేసుకున్న వజ్రాల సుబ్బారెడ్డి

యడ్లపాడు: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని కొండవీడు కొండల సమీపంలో మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వజ్రాల సుబ్బారెడ్డి రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం పెదపరిమిలోని అత్తగారి ఊరిలో కొంతభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఏడేళ్లుగా భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలతో అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు భార్య వరలక్ష్మికి స్వగ్రామమైన పాత మల్లాయపాలెం వెళ్లొస్తానంటూ బావమరిది బైక్‌పై వెళ్లాడు. అటు స్వగ్రామానికి వెళ్లక, ఇటు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. మర్నాడు ఉదయం బోయపాలెం గ్రామంలోని ఈద్గా వైపు ఉన్న కొండవీడు కొండల సమీపంలో శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్ కుమార్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి సమీపంలో స్వీట్‌ప్యాకెట్, సగం తాగిన కూల్‌డ్రింక్, పురుగుల మందు డబ్బా లభ్యమయ్యాయి. అంతకు మించి ఎలాంటి ఆధారాలు తెలియకపోవడంతో ఘటనా స్థలంలో ఉన్న బైక్ నంబర్ ఆధారంగా మృతిడి వివరాలను రాబట్టారు. వెంటనే ఘటన వివరాలను కుటుంబ సభ్యులకు అందించారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు భౌతికకాయాన్ని అప్పగించారు.

**విద్యకోసమా...బెట్టింగ్ నిమిత్తమా...!**

ప్రస్తుతం సుబ్బారెడ్డి పిల్లలు ఇంటర్మీడియెట్ చదువుతున్నారని, పిల్లల చదువులకు ఏటా రూ.1.5 నుంచిరూ.2.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని, విద్యకోసం అయిన అప్పుల్ని తీర్చలేక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడంటూ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బెట్టింగ్ వ్యవహారంలో నష్టపోయినందుకు అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుని ఉండోచ్చని.. బోయపాలెం ఘటనస్థలికి వచ్చిన సదరు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కారణం ఏదైనా సుబ్బారెడ్డి ఆత్మహత్యకు ప్రధాన కారణం ఆర్థిక సమస్యే. సమగ్ర వివరాలు పోలీసులు విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

### గార్లపాడు శివారులో అస్థి పంజరం లభ్యం

గార్లపాడు(కాకుమాను): మండలంలోని గార్లపాడు శివారు పంట పొలాల్లో మంగళవారం అస్థి పంజరాన్ని గుర్తించినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గార్లపాడు శివారు పంట పొలాల్లో అస్థి పంజరం ఉన్నట్లు గ్రామ వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చెరుకుని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న అస్థి పంజరాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. సుమారు 45 సంవత్సరాలు గల మగ మనిషి అస్థి పంజరంగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. మృతుని వివరాల కోసం దర్యాప్తు చేపట్టినట్లు ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

# ఘర్షణలకు కారకులైన 9 మంది అరెస్ట్

రెంటచింతల: రెంటచింతలలో మే నెల 12వ తేదీ చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. దాడి చేసి గాయపరిచిన ఘటనలో బాధితుడు ఎస్.సిద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందుతులను మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పెట్టగా వారికి 14 రోజులు రిమాండ్ విధించగా గుంటూరు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**పోలింగ్ రోజు ఘర్షణలకు పాల్పడిన పలువురిపై కేసులు**

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల రోజున గొడవలలో పాల్గొన్న వారికి పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడేనికి చెందిన 20 మందిని, గొట్టిపాళ్లలోని 9 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరికి కోర్టు రిమాండ్ విధించటంతో నెల్లూరు జిల్లా జైలుకు పంపినట్లు చెప్పారు. మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కంభంపాడు గ్రామంలో జరిగిన గొడవలకు సంబంధించిన వారిని కోర్టు హాజరు పర్చగా వారినీ నెల్లూరు జిల్లా జైలుకు కోర్టు పంపమని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**శిలాఫలకం ధ్వంసంపై కేసు**



గోళ్లపాడు గ్రామ సచివాలయంలో ధ్వంసం చేసిన శిలాఫలకం

గోళ్లపాడు(ముప్పాళ్ల): గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.హాజరత్తయ్య మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎన్నికలకు ముందు నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయాన్ని అప్పటి రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. ఆ మేర శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. సోమవారం విధులకు హాజరైన పంచాయతీ కార్యదర్శి భార్గవ్‌శ్యామ్ శిలాఫలకం ధ్వంసాన్ని పరిశీలించి ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వైఎస్సార్ సీపీ నేత సత్యంపై
# హత్యాయత్నం దారుణం



కాళిదాసు సత్యంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

- గెలిచామన్న అహంకారంతో దాడులు
- సోషల్‌మీడియాలో పోస్టింగులతో భయపెట్టాలని ప్రయత్నం
- వీటికి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌దే బాధ్యత
- పునరావృతమైతే పార్టీ క్యాడర్ మొత్తం రోడ్డు మీదకు వస్తుంది
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ వార్డు ఇన్‌చార్జి కాళిదాసు సత్యంపై హత్యాయత్నం దారుణమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక బోసురోడ్డులోని హోటల్ వద్ద మంగళవారం ఉదయం కాళిదాసు సత్యంపై దాడి సమాచారం తెలిసిన శివకుమార్, స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వివరాలను తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని చెప్పారు. ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడారు. పునరావృతమైతే చూస్తూ ఊరుకోమని, పార్టీ క్యాడర్ మొత్తం రోడ్డుపైకి వస్తుందని, తగిన గుణపాఠం చెప్పి తీరుతామని హెచ్చరించారు. ఎన్నికల్లో కూటమి గెలిచింది మొదలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం, వైఎస్సార్ సీపీకార్యకర్తలు/ నాయకులపై దాడులు, దౌర్జన్యాలను రాష్ట్ర ప్రజలు చూస్తూనే ఉన్నారని అన్నారు. తెనాలిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల ఫలితాల తర్వాత అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నట్టు గుర్తుచేశారు. అయినప్పటికీ సంయమనం పాటించాల్సిందిగా కార్యకర్తలకు సూచించినట్టు తెలిపారు. 2019లో తాను ఎమ్మెల్యేగా గెలిచినపుడు ఎలాంటి చిన్న ఘటన కూడా జరగలేదని చెప్పారు. తమ పార్టీ నాయకులను చంపటానికి బరితెగించారంటే ఎవరు బాధ్యులని శివకుమార్ ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచామన్న అహంకారంతో ఇవన్నీ చేస్తున్నారని ఆరోపించారు. సోషల్‌మీడియాలోనూ రెచ్చగొట్టే పోస్టులు పెడుతూ భయపెట్టాలని చూస్తున్నారని చెప్పారు. గెలిచిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు తెలియకుండా దిగువ క్యాడర్ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని భావించి, సంయమనం పాటించాలని చెబుతూ వచ్చానని శివకుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ తెలిసి ఉండకపోవచ్చన్నారు. ఏదేమైనా ఈ రకమైన సంస్కృతిని వెంటనే అరికట్టాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. హత్యాయత్నం చేసిన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని, దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అలుసుగా తీసుకుని ఉపేక్షిస్తే తమ పార్టీ క్యాడర్ చూస్తూ ఊరుకోదని స్పష్టంచేశారు.

# పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య



మృతుడు ఐతంరాజు వెంకటేశ్వర్లు

వెల్దుర్తి: చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రచ్చమల్లపాడులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఐతంరాజు వెంకటేశ్వర్లు(40) రెండేళ్లుగా తన రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంట సాగు చేస్తున్నాడు. పత్తి, మిర్చిలో నల్ల పురుగు సోకి పంటలు పండకపోవటంతో రూ.11 లక్షలు అప్పయ్యాడు. ఈ అప్పులెలా తీర్చాలో అర్థం కాక సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటల వరకు ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చిన భార్య అంజమ్మ బంధువులకు, స్నేహితులకు ఫోన్లు చేసినప్పటికీ ఆచూకి తెలియకపోవటతో గ్రామానికి చెందిన స్నేహితులు మాచర్ల చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికినప్పటికీ కనిపించలేదు. మంగళవారం ఉదయం మండాది సమీపంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద ద్విచక్ర వాహనం కనిపించటంతో చుట్టుపక్కల పరిశీలించగా గుడి వెనుక భాగంలోని పొలంలో పురుగుమందు తాగి మృతి చెందిఉన్నాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వెల్దుర్తి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకటేశ్వర్లు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# ఫ్లైఓవర్ పై గోడను ఢీకొని ఒకరి మృతి

పెదకాకాని వై జంక్షన్‌లో ఘటన



పెదకాకాని: పెదకాకాని వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామవరం గ్రామానికి చెందిన తార్లపల్లి వెంకటేశ్వర్లు గుంటూరు జేకేసీ కళాశాల సమీపంలో వాచ్ మెన్ గా పనిచేస్తున్నాడు. ఆయన కుమారుడు లక్ష్మీనారాయణ అదే ప్రాంతంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విజయవాడకు చెందిన వారి బైక్ రిపేరు చేసేందుకు తీసుకున్న లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి ఆ బైకును వారికి ఇచ్చేందుకు తన స్నేహితుడు సూర్యతో కలిసి రెండు బైకులపై విజయవాడ వెళ్లారు. బైక్ విజయవాడలో ఇచ్చి తిరిగి ఒక బైక్ పై గుంటూరు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ మంగళవారం తెల్లవారుజామున పెద్దకాకాని వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పైకి చేరుకునేసరికి అదుపుతప్పి ఎడమవైపునున్న సిమెంట్ గోడ సైడ్ వాల్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్ పై వెనక్కి కూర్చున్న లక్ష్మీనారాయణ ఫ్లైఓవర్ పైనుంచి వచ్చి సర్వీస్ రోడ్డులో కిందపడ్డాడు. బైక్ నడుపుతున్న సూర్య కుడివైపు రోడ్డుపై పడ్డాడు. ఫ్లైఓవర్ బైక్ నుంచి కింద పడ్డ లక్ష్మీనారాయణ (26) అక్కడి అక్కడికక్కడే మతిచెందగా సూర్య గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం లక్ష్మీనారాయణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పెదకాకాని సీఐ కె.వీరస్వామి తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ఉపాధ్యాయులపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం గుంటూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక విలువలతో పాటు నైతిక హక్కులు కాపాడబడతాయని అన్నారు. ఈనెల 13న పాఠశాలలు పున: ప్రారంభం కానున్న దృష్ట్యా, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చేయాలని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని, ప్రధానంగా జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కాపాడాలని కోరారు. గత ఏడాది 4,600 ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతులను కిలోమీటర్లు లోగా ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని, తక్షణమే సంబంధిత విద్యార్థులందరినీ తిరిగి పాత పాఠశాలలకు పంపించడం ద్వారా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి పర్చాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవ గణాంకాలను పరిగణలోకి తీసుకుని మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరంతరం చర్చలకు పిలవటం, ప్రజాస్వామ్య పద్ధతిగా వ్యవహరించటం చేయాలని, వారి న్యాయమైన కోరికలను తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, నైతిక విలువలు పెంపుదల ఉంటాయనే నమ్మకాన్ని తల్లిదండ్రులతో ఆటు సమాజంలో కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సెలింగ్ విధానానికి భిన్నంగా అక్రమంగా చేసిన అన్ని బదిలీలను ప్రభుత్వం రద్దు చేయాలని, భవిష్యత్‌లో కౌన్సెలింగ్ బలోపేతం చేసే విధంగా బదిలీల చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు నెలవారి ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలని కోరారు. గతంలో ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ గడిచిన మూడేళ్లుగా యూటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం, విద్యార్థులు నాణ్యమైన విద్య అందించే దానికోసం నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులందరూ యూటీఎఫ్‌లో సభ్యులుగా చేరడం ద్వారా ఉపాధ్యాయ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ సమావేశానికి ముందుగా సంఘ కార్యాలయం ముందు ఉన్న చెన్నుపాటి లక్ష్మయ్య విగ్రహానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ఎగరవేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ శ్రీనివాస్, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివ పార్వతి, కోశాధికారి ఎండీ గయాసుద్దీన్ పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నూరు శాతం ఉచిత వైద్యం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ కార్డు కలిగి ఉన్న రోగులకు నూటికి నూరు శాతం ఉచిత వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ రోగులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి ఆరోగ్య శ్రీ అందలేదని బాధ పడకూడదు. అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి వైద్యుడు వ్యక్తిగత పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య మిత్ర పర్యవేక్షణ పూర్తిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. ప్రతివార్డులో వైద్యులు, ఆరోగ్య మిత్ర, డీఈఓలతో సమన్వయంతో పని చేస్తూ ఆరోగ్య శ్రీని బలోపేతం చేయాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన సాంకేతిక సిబ్బంది పోస్టుల అనుమతి కోసం డీఎంఈకు లేఖ రాయాలని సిబ్బందికి సూచించారు. ఆప్తమాలజీ విభాగంలో ఈఎస్‌డబ్ల్యూఎల్ మిషన్ సత్వరమే అక్కడ నుంచి యూరాలజీ విభాగానికి తరలించాలని కోరారు. రిఫరల్ ఆస్పత్రిగా ఉన్న గుంటూరు మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఏం ఈ ఆర్ కే సౌకర్యం కల్పించాలన్నారు. లేకుంటే అధునాతన మైన సంక్లిష్టమైన ఆపరేషన్లు వైద్యం చేయడానికి సరైన ఆర్థిక వనరులు లేకపోవడంతో పని కుంటూ పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉమా జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, జాయింట్ డైరెక్టర్ సుధారాణి, ఏడీ సీ.హెచ్.నాగేశ్వర రావు పాల్గొన్నారు.